అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 24 మే 2023

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారుల హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

తెలంగాణ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్వ్యవస్థీకరణకు జీఓ ఎంఎస్ నంబర్ 18, 19 ఉత్తర్వులకు సీఎం కేసీఆర్ ఆమోద ముద్ర వేయడంతో అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియకు సహకరించిన మంత్రులకు, ఎమ్మెల్యేలకు, రాష్ట్ర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ బి. వీరానంద్, ఈఈ సమత, డిఇఇ మురళి, డిఇఇ గిరిధర్, ఎఇఇ/ఎఇ జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

టిప్పర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి



నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మోస్రా మండల కేంద్రంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి వేగంగా వచ్చి టిప్పర్ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఊటుపల్లి గ్రామానికి చెందిన వీరేశం (45) కూలీగా పని చేస్తుంటాడు. బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టడంతో తొడ భాగంలో తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్టు ఎస్ఐ తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

ఇసుక తరలించేందుకు లారీలుంటయ్
ధాన్యం తరలించేందుకు ఉండవా..?

- వరి కొనుగోలు చేయాలని హైవేపై రైతుల ధర్నా


జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టిన రైతులు

నవతెలంగాణ-జుక్కల్

ఇసుక తరలించేందుకు లారీలుంటున్నా యని, కానీ ధాన్యం తరలించేందుకు ఉండటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలు లేవనే కారణంతో కొనుగోలు కేంద్రాలు మూసివేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో 161వ జాతీయ రహదారిపై మంగళవారం పెద్దఎత్తున రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లారీలు లేవనే సాకుతో వరి కొనుగోలు కేంద్రాలను మూసివేశారని తెలిపారు. ఇసుక తరలించేందుకు లారీలు నడుస్తున్నాయని, కానీ ధాన్యం తరలించేందుకు మాత్రం లారీలు లేవంటున్నారని వాపోయారు. ఆ లారీలన్ని రాజకీయ నాయకులవే కావడంతో రెవెన్యూ, పోలీస్ శాఖ వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై వాహనాల టైర్లు వేసి మంటపెట్టి నిరసన చేపట్టారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

ఆర్థిక ముఖ చిత్రం.. ఉపయుక్తం

- పోటీ పరీక్షల అభ్యర్థులు వినియోగించుకోవాలి
- పుస్తక ఆవిష్కరణలో కలెక్టర్


పుస్తకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖ చిత్రం పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం తన ఛాంబర్ లో ప్రణాళిక శాఖ ముద్రించిన తెలంగాణా సామాజిక ఆర్థిక ముఖ చిత్రం-2023 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పుస్తకం రాష్ట్ర సామాజిక ఆర్థిక స్థితిగతులను తెలపడమే గాక ప్రభుత్వ విధానాలు, పథకాలు, వివిధ కార్యక్రమాల సమాచారాన్ని, వాటి పనితీరును తెలుసుకోవచ్చన్నారు. వివిధ విభాగాలలో రాష్ట్రం సాధించిన ప్రగతి, జవాబుదారీతనం, పారదర్శకతో బంగారు తెలంగాణ సాధన దిశగా భవిష్యత్ మార్గాలపై సమగ్ర అధ్యయనం చేయడానికి ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. ఇంతటి చక్కటి సమాచారంతో రూపొందించిన పుస్తకం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకే గాక సామాజికవేత్తలు , మేధావులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. 311 పేజీలు గల ఈ పుస్తకం ధర 150 రూపాయలు ఉందన్నారు. ఈ పుస్తకం కావలసిన వారు కలెక్టరేట్‌లోని ముఖ్యప్రణాళికాధికారి కార్యాలయంలో కార్యాలయ పనివేళలందు 150 రూపాయాలకు చెల్లించి పొందవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి రాజారాం, డీఆర్‌డిఓ సాయన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, పశు సంవర్ధక అధికారి సింహరావ్ పాల్గొన్నారు.

నెత్తుటి దారులు


ఫైల్

- అవగాహన కల్పిస్తున్నా ఆగని రోడ్డు ప్రమాదాలు
- కేవలం నాలుగు నెలల్లో 302 రోడ్డు ప్రమాదాలు.. 132 మంది మృత్యువాత
- 40 బ్లాక్‌స్పాట్‌లు గుర్తించినా చర్యలు శూన్యం
- జాడేలేని ప్రమాదాల నివారణ కమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోడ్డు ప్రమాదం.. పోలీసులకు ఓ కేసు కాగా.. మీడియాకు ఒక వార్త. కానీ బాధిత కుటుంబానికి జీవితాంతం తీరని గుండెకోత మిగులుస్తోంది. కొందరి అతివేగం, అజాగ్రత్త మిగతా వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతోంది. అనుకోని రోడ్డు ప్రమాదాల్లో అయిన వారు మృత్యువాత పడుతుండటంతో కుటుంబీకుల వేదన వర్ణనాతీతంగా మారుతోంది. అలాంటి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు మాత్రం అంతంత మాత్రమే. అయితే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించినా.. అక్కడ ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 40 ప్రాంతాలను గుర్తించినా చర్యలు శూన్యం. ప్రమాదాల నివారణ కోసం పని చేయాల్సిన కమిటీ.. దాని ఉనికి కోల్పోయింది. చలాన్ల వసూళ్లపై చూపిన శ్రద్ధ ప్రమాదాల నివారణపై చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొందరి అతివేగం, అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నా ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. ఈ ఏడాదిలో మే 19వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 302 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా.. 117 ప్రమాదాల్లో 132 మంది మృత్యువాత పడ్డారు. 159 రోడ్డు ప్రమాదాల్లో 283 గాయాల పాలయ్యారు. 26 రోడ్డు ప్రమాదాలలో వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకుండా కేవలం వాహనాలు మాత్రమే డ్యామేజ్ అయ్యాయి. అయితే గత మూడేండ్ల కాలంలో చోటుచేసుకున్న ప్రమాదాల కంటే ఈ ఏడాది నాలుగు నెలల 19 రోజుల కాలంలో చోటుచేసుకోవడం గమనార్హం.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

జిల్లాలో రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. కరోనా తర్వాత సొంత వాహనాల వాడకం పెరగడంతో పాటు ప్రమాదాలూ పెరుగుతున్నాయి. గత మూడేండ్లతో పోలిస్తే ఈ ఏడాది నాలుగు నెలల 19 రోజుల కాలంలో ఎక్కువగా చోటుచేసుకోవడం గమనార్హం. 2020వ సంవత్సరంలో 306 కేసులు నమోదు కాగా 331 మంది మరణించగా 546 మంది క్షతగాత్రుల పాలయ్యారు. 2021 సంవత్సరంలో 320 రోడ్డు ప్రమాదాల కేసులు నమోదు కాగా 329 మంది మృత్యువాత పడగా 522 మంది గాయపడ్డారు. 2022లో 291 కేసుల నమోదు కాగా 320 మంది మృత్యువాత పడగా 643 మందికి గాయాల పాలయ్యారు. తాజాగా 2023వ సంవత్సరంలో కేవలం 4 నెలల 19 రోజుల వరకే మొత్తం 302 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా.. 132 మంది మృత్యువాత పడ్డారు.

40 బ్లాక్‌స్పాట్‌లు గుర్తింపు.. జాడే లేని కమిటీ

తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా పరిగణిస్తారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 40 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. నిజామాబాద్‌లో బ్లాక్ స్పాట్‌లు ఆర్‌ఆర్ చౌరస్తా, వర్ని చౌరస్తా, అరసపల్లి బైపాస్, కాలూరు ఎక్స్ రోడ్ వద్ద ఈ మధ్య రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బొర్గం చౌరస్తా, ఖానాపూర్, నడిపెల్లి, ధర్మారం, డిచ్‌పల్లి హైవే ఇందల్వాయి టోల్‌గేట్ మధ్యలో ఈ మధ్య ప్రమాదాలు పెరిగాయి. దీంతో పాటు ఆర్మూర్, పెర్కిట్ చౌరస్తా, జాతీయ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్టు రోడ్ సేఫ్టీ కమిటీ గుర్తించింది. ఇంత జరుగుతున్నా నివారణ చర్యలు మాత్రం చేపట్టడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.


ఫైల్

రోడ్డు ప్రమాదాల నివారణ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా, సీపీ వైస్ చైర్మన్‌గా, ఆర్‌అండ్‌బీ ఈఈ, పంచాయతీరాజ్ ఈఈ, ట్రాఫిక్ ఏసిపి, నేషనల్ హైవే అథారిటీ సభ్యులు, నిర్మల్‌కు చెందిన వ్యక్తి, ఎక్సైజ్ శాఖ నుండి ఒకరు, ఫారెస్టు కార్యాలయం నుండి ఒకరు, 108 నుండి ఈఎమ్ఆర్ఐ సభ్యుడు ఒకరు ఆర్టీవో కార్యాలయం నుండి ఒకరితో కమిటీ ఉంటుంది. దీనిని మొత్తం నోడల్ అధికారిగా ఆర్‌అండ్‌బీ ఈఈ ఒకరు కో ఆర్డినేట్ చేస్తారు. అయితే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా కమిటీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 40 బ్లాక్ స్పాట్‌లు గుర్తించినా అక్కడ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
ఏసీపీ కిరణ్‌కుమార్



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. పరిమిత వేగం కంటే అధిక వేగంగా వెళ్లడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు ప్రయివేటు వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతు న్నాయి. పోలీస్‌శాఖ నుంచి అవగా హన కార్యక్రమాలు చేపడుతున్నా.. వాహనదారులు పాటించి నప్పుడే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి. అధికంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

సర్పంచ్ భర్త దారుణ హత్య..?

- ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఘటన




మృతిచెందిన నర్సాగౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాల యానికి కూతవేటు దూరంలో దారుణ హత్య ఘటన చోటు చేసుకుంది. రామారెడ్డి మండలం సింగరాయపల్లి గ్రామ సర్పంచ్ మహేశ్వరి భర్త అధికం నర్సాగౌడ్ (48)ను గుర్తు తెలియని వ్యక్తులు అతి దారుణంగా హత్య చేశారు. నర్సాగౌడ్ ముఖంపై గాయాలు ఉండడంతో ఎవరో కావాలని హత్య చేశారని సింగరాయపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత వారం రోజులుగా గ్రామంలో గొడవలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. వాటిని దృష్టిలో పెట్టుకుని కావాలనే నర్సాగౌడ్‌ను హత్య చేశారని ఆరోపిస్తున్నారు. నర్సాగౌడ్ సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరి ఉదయం వరకు ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో నర్సాగౌడ్ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి కామారెడ్డి డీఎస్పీ సురేష్, రూరల్ సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ ప్రసాద్‌లు చేరుకొని పరిస్థితి సమీక్షించారు. అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మమ్మల్నీ రెగ్యులర్ చేయాలి

- యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన



నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీలలో విద్యార్థులు నాణ్యమైన విద్య బోధన చేస్తున్న తమను కూడా రెగ్యులర్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు కోరారు. మంగళవారం టీయూతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల అధ్యక్షుడు డాక్టర్ వీ దత్తాహరి మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని సర్వీస్‌లను క్రమబద్ధీకరించాలని సమిష్టిగా నిర్ణయం తీసుకొని దశల వారీగా నిరసనలు చేపట్టనున్నట్టు తెలిపారు. తెలంగాయ యూనివర్సిటీ పరిధిలోని సౌత్ క్యాంపస్, బీఈడీ కళాశాల సారంగాపూర్ క్యాంపస్‌లలోని అధ్యాపకులు అందరూ కలిసి ఈ కార్యక్రమం నిర్వహించమన్నారు. నేడు సైతం యూనివర్సిటీలోని కళాశాల ఎదుట ఉదయం 11.30 గంటలకు నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు ఉపాధ్యాయులు శరత్, శ్రీనివాస్, పోతురాజు శ్రీనివాస్, నాగేంద్రబాబు, గంగా కిషన్, జోష్న, ఈ కామర్స్ శ్రీనివాస్, గంగాధర్, నాగేశ్వరరావు, సందీప్, ఆనంద్, కిరణ్ రాథోడ్, రాజేశ్వరి, రమ్య, నర్సయ్య రామేశ్వర్ రెడ్డి, గంగ కిషన్, సురేష్ గౌడ్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

2 వేల నోటుతో తంటాలు

- సర్వీస్ పాయింట్లలో తీసుకునేందుకు నిరాకరణ.. ఇబ్బంది పడుతున్న ప్రజలు

నవతెలంగాణ-బిచ్కుంద

రెండు వేల రూపాయల నోటును ఉపసంహ రించుకుంటున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించిన విషయం విధితమే. వాటిని మార్చుకునేందుకు నుంచి సెప్టెంబర్ 31వ తేదీ వరకు గడువు విధించిన విషయం తెలిసింది. అయితే వాటిని తీసుకునేం దుకు పలువురు నిరాకరిస్తున్నారు. దీంతో పాటు బ్యాంకుల సర్వీస్ పాయింట్‌ల నిర్వాహకులు సైతం 2000 నోటును తీసుకోవడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం నుంచి బ్యాంకుల్లో రూ 2 వేల నోట్లను మార్చుకోవచ్చని ఆర్‌బీఐ పేర్కొన్నది. బ్యాంకులకు వెళ్లి లైన్‌లు కట్టలేని వారు ఏలాగైనా వాటిని మార్చుకునేందుకు యత్నిస్తున్నారు. అయితే రైతులు, చిన్న, పెద్ద వ్యాపారస్తులు, గృహిణులు, ఉద్యోగులు తమ వద్ద ఉన్న 2 వేల నోట్లను చలామణి చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ పనులన్నీ వదులు కొని బ్యాంకుల వద్ద క్యూ లైన్‌లో నిలబడాల్సి వస్తుందని జంకుతున్నారు.


సర్వీస్‌సెంటర్‌లో మాట్లాడుతున్న

కస్టమర్స్ సర్వీసింగ్ సెంటర్లలో 2 వేల నోట్ల నిరాకరణ

బ్యాంకులలో 2 వేల రూపాయల నోట్లను తమ ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవచ్చని, పది నోట్ల వరకు ఉంటే నేరుగా మార్చుకోవచ్చని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. అయితే బిచ్కుంద మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న కస్టమర్ సర్వీసింగ్ సెంటర్లు (మినీ బ్యాంక్)లలో 2 వేల రూపాయలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. కస్టమర్ సర్వీసింగ్ సెంటర్లలో ఆర్బిఐ ద్వారా 2వేల డినామినేషన్ ఆప్షన్‌ను లాక్ చేయడంతో పొదుపు సంఘాల మహిళలు, కూలీలు, చిన్న వ్యాపారస్తులు తమ పనులన్నీ విడిచిపెట్టుకొని గత్యంతరం లేక ఆయా గ్రామాల నుండి మండల కేంద్రంలో ఉన్న ఎస్బిఐ, కెనరా బ్యాంక్ తదితర బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఇబ్బందులు కల్గుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై ఎస్‌బీఐ బిచ్కుంద బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ క్రాంతి కుమార్‌ను వివరణ కోరగా ఆర్బిఐ ఆదేశాల మేరకు ఖాతాదారుడు ఎస్బిఐ బ్యాంకులో తమ వద్ద ఉన్న 2 వేల నోట్లను రోజు 20 వేల వరకు తమ ఖాతాలో జమ చేసుకోవచ్చని ముందస్తుగా అవకతవకలు జరగకుండా కస్టమర్ సర్వీసింగ్ సెంటర్లలో 2వేల నోట్లు తీసుకోకుండా డినామినేషన్ లాక్ చేసినట్టు తెలిపారు. 2 వేల నోట్ల డిపాజిట్ తదితర సమస్యలు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా బ్యాంక్ అధికారులను సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకో వాలని సూచించారు.

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయాలి

- మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీష్ రావు సూచించారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే తొమ్మిది జిల్లాలలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించే హెల్త్ డే రోజున మిగతా 24 జిల్లాలలోని అన్ని శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లో అట్టహాసంగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.84 లక్షల మంది గర్భిణీలకు వీటిని అందజేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలిగామని, మాతాశిశు మరణాలను అరికట్టడంలో తెలంగాణ దేశంలోనే మూడవ స్థానంలో ఉందన్నారు. అంతేకాకుండా, ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. ఇదే కోవలో గర్భిణీల్లో రక్తహీనతను నివారిస్తూ, పుట్టబోయే శిశువులు ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వం ప్రస్తుతం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించిం దన్నారు. న్యూట్రిషన్ కిట్ పంపిణీ కార్యక్రమం కూడా మంచి ఫలితాలను అందిస్తుం దనే నమ్మకం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు.. హాజరైన అధికారులు

గ్రామస్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా పల్లె దవాఖానాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. వేసవి తీవ్రతను దష్టిలో పెట్టుకుని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా సూచనలు అందించా లని, పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు వంటి వసతులు ఉండేలా చర్యలు తీసుకోవా లని కలెక్టర్లకు హితవు పలికారు. సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని అందరికీ అందించేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ శ్వేత, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పని చేస్తున్నా డబ్బులు రావట్లే

- పని చేయని వారికి ఉపాధి డబ్బులొస్తున్నయ్
- ఎంపీడీవో కార్యలయాన్ని ముట్టడించిన కూలీలు


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన కూలీలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉపాధి పని చేస్తున్నా తమకు కూలీ డబ్బులు రావడం లేదని, పని చేయని వారికి వస్తున్నాయని పలువురు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందల్‌వాయి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు డబ్బులు రాక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, పని వద్ద అధికారులు పర్యవేక్షణ చేపట్టకపోవడంతో సమస్యలు వస్తున్నాయని తెలిపారు. గ్రామంలో ఉపాధి పనికి రాని వారి పేర్లు నమోదు చేసుకుని బిల్లులను సైతం తీసుకుంటున్నారని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్, ఉపసర్పంచ్ రాజేందర్ కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. అక్రమాలకు పాల్పడ్డ వారిని విచారణ చేపట్టి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎపిఓ పోశెట్టి మాట్లాడుతూ గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

గొర్రెల పంపిణీపై 25 అవగాహనా సదస్సు


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ఈనెల 25 నుంచి రెండో విడత గొర్రెల పంపిణిపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో మంగళవారం రెండో విడత గొర్రెల పంపిణీ పై పశుసంవర్ధక శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అవగాహన సదస్సులకు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే విధంగా అధికారులు చూడాలని తెలిపారు. లబ్ధిదారుల నుంచి ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలని చెప్పారు. రెండో విడతలో 6377 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు తమ వాటా ధనంగా రూ.43,750 చెల్లించాలని సూచించారు. ఒకరికి 20 గొర్రెలు, ఒకటి పొటెల్ పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహరావు, పశు వైద్యులు పాల్గొన్నారు.

పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసిన పారిశ్రామిక వేత్త

నవతెలంగాణ-ఆర్మూర్

పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ స్వగ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్ రెడ్డి, వారి కుమార్తె డాక్టర్ సుచరితరెడ్డి బిజెపిలో చేరనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్, జిల్లా పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలించిన డీఎల్‌పీవో

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని ఏర్గట్ల, తడపాకల్ గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను మంగళవారం ఆర్మూర్ డీఎల్‌పీఓ శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం ఏర్గట్ల నర్సరీలో మొక్కలను పరిశీలించి ఎండాకాలం ఉన్నందున ఎప్పటికప్పుడు మొక్కలకు నీరందించి, వాటిని కాపాడాలని కోరారు. ఏర్గట్లలో జీపీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సర్పంచులు గుల్లే లావణ్య గంగాధర్, పత్తిరెడ్డి ప్రకాష్, ఎంపీఓ శివ చరణ్, పంచాయతీ కార్యదర్శులు జాకీర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేయాలి

- సీపీఐ(ఎంఎల్)

నవతెలంగాణ-బోధన్

తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తక్షణమే కొనుకోలు చేయాలని సీపీఐ(ఎంఎల్) బోధన్ డివిజన్ కార్యదర్శి వరదయ్య మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన కూడా కోనుగోలు కేంద్రాలలో అధికారులు పట్టించుకోవడం లేదని దాంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. క్వింటాకు 4,5 కిలోలు తరుగు తీయడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇవే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బోధన్, సాలురా, హున్స ఇతర సొసైటీ కొనుగోలు కేంద్రాలలో వేల బస్తాల ధాన్యం ఉందని, ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్, ఇతర అధికారులు ధాన్యం కోనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ఆచరణలో అడుగు ముందుకు పడటం పడటంలేదని అన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న నేటికి ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. తక్షణం ధాన్యం కోనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆకాల వర్షానికి, వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వీవోఏలను పర్మినెంట్ చేయాలి

- వివోఏల రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్ రమ
- 30వ రోజుకు వీవోఏల సమ్మె

నవతెలంగా-కామారెడ్డి/ఆర్మూర్/రెంజల్/ఎడపల్లి

కామారెడ్డి: వీవోఏలను పర్మినెంట్ చేయాలని వివోఏల రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్ రమ అన్నారు. కామారెడ్డిలో సమ్మె వీవోఏ రాష్ట్ర కార్యదర్శి రాజ్ కుమార్.. రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు రమ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 18వేల వేల మంది కార్మికులు ఉన్నారని తెలిపారు. పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని 30రోజుల నుండి సమ్మె చేస్తున్నారన్నారు. డిమాండ్లను పరిష్కారం చేయకుండా ప్రభుత్వమే ఏపిఎంలు, సీసీలతో ఒత్తిళ్లు తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ అధ్యక్షతన వహించారు. కే రాజనర్సు. వీవోఏ జిల్లా నాయకులు శివరాం, బాలరాజు, రాజలింగం, అనసూయ, సరిత, కండే రావు, రాజశేఖర్, సురేందర్, మల్లేష్, ఉమాకాంత్, సాయిబాబా, దావీద్, ఫైన్ బేగం, నిర్మల, ఉమాకాంత్, పద్మ, కిషోర్, శీను నాయక్, అంజమ్మ, రాజు, సురేష్. పోచయ్య పాల్గొన్నారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న వీవోఏల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్ రమ

ఆర్మూర్: కనీస వేతనం అమలు చేయాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఐకేపీ వీవోఏల సంఘం అధ్యక్షురాలు సువర్ణ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సమ్మె చేస్తున్న వీరికి సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి మద్దతు తెలిపి మాట్లాడారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తుంటే స్పందించటం లేదని అన్నారు. వెంటనే ఐకేపీ విఓఏల సమస్యలు పరిష్కరించాలని, వారికి కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకు కేవలం 3900 ఇవ్వడం అత్యంత దుర్మార్గమన్నారు. వారికి కనీస వేతనాలు అమలు చేయాలని, తక్షణమే ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్టుగా 10,500 గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రేఖ ఉపాధ్యక్షురాలు జ్యోతి, కోశాధికారి స్రవంతి, సహాయ కార్యదర్శి సంతోషి, వీవోఏలు పాల్గొన్నారు.

ఎడవల్లి: మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం ఎదుట వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మెలో మాట్లాడుతూ.. సెర్ఫ్ ద్వారా గుర్తింపు కార్డులతోపాటు డీఆర్‌డీఏ ద్వారా వీవోఏల ఖాతాలోకి నేరుగా వేతనాలను జమ చేయాలని డిమాండ్ చేశారు. శోభ, సుదర్శన్, పూజ, యూసుఫ్, కుమ్మరి పుష్ప, సంధ్య, నసీరా బేగం, మహేశ్వరి పాల్గొన్నారు.

ంలో గత కొన్ని సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేసిన వీఐవోలకు ప్రభుత్వం ఎలాంటి గుర్తింపు ఇవ్వడంలేదని సంఘం అధ్యక్షులు గంగాధర్ ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని వీఏవోలు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో..



రెంజల్‌లో..

మిగిలిన సీట్లకు 29న అడ్మిషన్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం కు గాను ఏకలవ్య ఆదర్శ గురుకుల కళాశాల గాంధారి(సిఓఈ) కామారెడ్డి జిల్లా, ఇందల్ వాయి ఈఎంఆర్ఎస్ కళాశాల నిజామాబాద్ జిల్లా మిగిలిన సీట్లకు అడ్మిషన్‌కు గాను కౌన్సిలింగ్ ఈనెల 29న ఈఎంఆర్ఎస్ గాంధారిలో నిర్వహించనున్నట్లు ఏకలవ్య గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులని అయన తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో పాసైన విద్యార్థులు మాత్రమే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని, పదవ తరగతిలో వచ్చిన జీపీఎ ఆధారంగా సీట్లను కేటాయింపు ఉంటుందని వివరించారు. ఈఎంఆర్ఎస్ గాంధారిలో బాలురకు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఇందల్ వాయి ఏకలవ్య లో బాలికలకు మాత్రమే ఉంటుందని ఆ విషయం గమనించాలని పేర్కొన్నారు. గాంధారిలో ఎంపిసి- 05, బిపిసి- 10,సిఈసి -15 సీట్లకు ఇందల్‌వాయిలో ఎంపిసి -23,బిపిసి -15,సిఈసి -20 సీట్లకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్2, ఫొటోస్ లేటెస్ట్ (4), క్యాస్ట్ సర్టిఫికెట్ (2),ఇన్కమ్ సర్టిఫికెట్ 2023.24 కొత్తది (2), 2023-24 పాసైన జీపీఏ సర్టిఫికెట్ (ఇంటర్నెట్ మెమో) పైన సూచించిన విధంగా సర్టిఫికెట్స్ అన్ని తీసుకొని ఉదయం 10.00 గంటలకు హాజరుకావాలని కోరారు.

టీబీ రహిత జిల్లాగా మార్చాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర మేయర్ దండు నీతు కిరణ్‌ను స్టేట్ ఏసీ ఎస్ఎం కన్సల్టెంట్ సురేష్ మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో మేయర్ సహకారం కావాలని కోరారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని, టీబీ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహనా పెంపొందేలా యాక్షన్ ప్లాన్ చేయమని డిఎంహెచోఓకు సూచించారు. టీబీపై అవగాహనా పెంచే ఏ కార్యక్రమానికైనా తాను హాజరవుతాననితెలిపారు. దేశం లోనే నిజామాబాదు జిల్లాకు టిబి నియంత్రణ లో పేరు వచ్చిందని, క్షయ విభాగం ఉద్యోగులు తమ సేవలు ఇలాగే కొనసాగిస్తూ నిజామాబాద్‌ను టీబీ రహిత జిల్లాగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ యం. సుదర్శనం, జిల్లా టిబి కోఆర్డినేటర్ రవి, డీపీపీఎం నరేష్ ఉన్నారు.

నిధులు మంజూరు పట్ల కృతజ్ఞతలు:ఎస్ఎంసి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ మోడల్ పాఠశాల అభివృద్ధికి నాలుగు లక్షల 71వేలు మంజూరైంది నిజమేనని ఈ మొత్తం ఎస్ఎంసి దగ్గర ఉంచినట్టు ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఎస్ఎంసి కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు మంజూరైన నిధులు దుర్వినియోగం చేసినట్టు మంగళవారం పత్రికలలో వచ్చిన మాట అవాస్తవమని పేర్కొన్నారు. ఈ మొత్తం డబ్బుల నుండి మూడు లక్ష 50వేలు మొరంబాకి కట్టడం జరుగుతుందని, మిగిలినవి పాఠశాల మరమ్మతుకు ఎస్ఎంసి ద్వారా ఉపయోగించటం జరుగుతుందని తెలిపారు. నిధులు మంజూరుకు సహకరించిన జిల్లా కలెక్టర్ కు, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డికి, చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్‌కు కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డిలకు మోడల్ స్కూల్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్సిటీస్ డిగ్రీ ప్రవేశాలకోసం నిర్వహించే సియుఈటి (కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్) నిజామాబాద్‌లో ఈనెల 23 నుండి ప్రారంభించారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టిఏ) జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కర్ మేరీగ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్‌లోని బోధన్ రోడ్‌లోగల ఏవి ఎంటర్ప్రైజెస్ లో ఆన్లైన్ పరీక్ష నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షలు మొత్తం మూడు షిఫ్టులలో నిర్వహించగా 171 మంది విద్యార్థులకు గాను 124 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. బుధవారం మూడుషిఫ్టులలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సియుఈటి పరీక్షకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్న ఈ ఫోన్ 8978198421 నెంబర్‌కు సంప్రదించాలని అన్నారు.

హెూమంలో పాల్గొన్న అధికారులు



హోమంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, కుటుంబ సభ్యులు శ్రీ రుక్మిణీ పాండురగా, శ్రీ అయ్యప్ప, హన్మన్ నూతన విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా రెండోరోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అడిషనల్ కలెక్టర్ చిత్ర మిశ్రా, ఆర్డీఓ రవి కుమార్ పూజలను పర్యవేక్షించారు. వారిని అర్బన్ ఎమ్మెల్యే బిగాల సన్మానించారు. రాత్రి అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం శ్రీశ్రీశ్రీ జగద్గురు హంపి విద్యారణ్య భారతీ మహాస్వామి ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ కార్పొరేటర్లు, సర్పంచ్ అశోక్ కుమార్, ఎంపిటిసి ఎస్. వేకటేశ్వర్ రావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ రమణ రావు, మాజీ సర్పంచ్ రాజేందర్, నాయకులు రాజ్ మల్లయ్య, దర్గాల సాయిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సివిల్స్ ఫలితాల్లో మెరిసిన బోధన్ విద్యార్థి

నవతెలంగాణ-బోధన్



సివిల్స్ ఫలితాలలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. మంగళవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాలలో నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన మహేష్ కుమార్ సివిల్స్‌లో 200వ ర్యాంకు సాధించి తన సత్తా చాటాడు. మహేష్ కుమార్ తల్లి యాదమ్మ పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఏఎన్ఎం గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి రాములు విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తల్లి దండ్రులు సివిల్స్ ఫలితాలలో తమ కుమారుడు 200వ ర్యాంకు సాధించడం గర్వంగా ఉందన్నారు.

బ్రాహ్మణపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మూడు రోజులుగా గ్రామస్తుల ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, బిజెపి బోధన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ప్రకాష్ రెడ్డి లతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాసరావు, నాయకులు బిల్లా రామ్మోహన్, బ్రాహ్మణపల్లి సర్పంచ్ అంగపట్నం లక్ష్మీ రాజేందర్‌రెడ్డి. ఉపసర్పంచ్ హనుమంతు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విగ్రహప్రతిష్టాపనలో పాల్గొన్న సుదర్శన్‌రెడ్డి, నాయకులు

రైలు నుంచి పడి యువకుడి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



వెళ్తున్న రైలు నుంచి పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై ప్రణయ్ కుమార్ మంగళవారం వెల్లడించారు. నగరంలోని అమ్మ వెంచర్ వద్ద గల పరిసర ప్రాంతంలో రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. యువకుని వయసు 25 ఏళ్ల వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు చెప్పారు. మృతున్ని గుర్తిస్తే, రైల్వే పోలీసులకు లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ

నవతెలంగాణ-మోర్తాడ్



మాట్లాడుతున్న మనాల మోహన్‌రెడ్డి

రాష్ట్రంలో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని వడ్యాట్‌లో పెద్దమ్మ గుడి వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అరాచకాలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, వాటిని ఎదుర్కోవడానికి పార్టీ మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు పార్టీ పథకాలను వివరిస్తూ పార్టీ గెలుపుకు కృషి చేయాలని అన్నారు. పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండేది కాంగ్రెస్ పార్టీని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాములు, నాయకులు సంతోష్, నరసయ్య ,మహిపాల్, మురళి, రాజశేఖర్. దేవేందర్. నవీన్, వెంకటేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న జూనియర్ కార్యదర్శులు

నవతెలంగాణ-ఆర్మూర్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయం వద్ద మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే ఆశన్న జీవన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు దేవేందర్ ,ప్రసాద్, నజీర్, రవి, హారిక ,సుకన్య, స్వాతి, సౌందర్య, రాహుల్, రవి తదితరులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి :ఏవో

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవీపేట్, బినోల సొసైటీ పరిధిలోని రైతులకు ఈనెల 24 నుండి జీలుగు విత్తనాలను 30 కిలోల బస్తాకు 842 రూపాయలకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

మైనారిటీస్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మేయర్ దంపతులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మైనారి టీస్ కార్పొరేషన్ చైర్మన్ తారీక్ అన్సారీని మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్ దంపతులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



బొకేను అందజేస్తున్న మేయర్ దంపతులు

ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని అంగడి బజార్‌లో ఏర్పాటుచేసిన సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ అన్నారు. పట్టణంలో మంగళవారం మేరా లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను అంగడి బజార్లో ప్రారంభించారు ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మెప్మా సిబ్బందికి, వార్డు ఆఫీసర్లకు సెంటర్ యొక్క ప్రాముఖ్యత వివరించారు. ప్రజలు ఈ సెంటర్లకు పాత వస్తువులు ఏమైనా ఉంటే తీసుకువచ్చి ఇవ్వాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చౌహన్, సానిటరీ ఇన్స్పెక్టర్, మున్సిపల్ ఇంజనీర్, టిఎంసి, సుంకరి రంగన్న పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యాదవ్ సంఘానికి 12 లక్ష నిధులు మంజూరు

నవతెలంగాణ-ధర్పల్లి



నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

మండలం లోని రామడుగు గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘానికి ఎస్డిఎఫ్ నిధులనుండి 12 లక్షలు మంజూరు పత్రాన్ని మంగళవారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సంఘ సభ్యులకు అందించినట్టు వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా యాదవ సంఘ సభ్యులు మాట్లాడుతూ నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గారికి సహకరించిన జెడ్పీటిసి బాజిరెడ్డి జగన్ మోహన్, ఎంపీపీ నల్ల సరికాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్,గ్రామశాఖ అధ్యక్షుడు రమేష్ గౌడ్, మెండె గంగారాం, పెట్టెం నర్సయ్య, దర్కట్ల నరేందర్, గుమ్మడి శ్రీను, నాగుల ఎర్రన్న, గొల్ల గంగరెడ్డి, గడ్డం శ్రీను, డా.భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపుతో ప్రపంచాన్ని చూడగలుగుతాం

- కంటి వెలుగు ప్రత్యేక వైద్య అధికారి రాజ్ కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

కంటి చూపుతో ప్రతి ఒక్కరూ ప్రపంచాన్ని చూడగలుగుతామని కంటి వెలుగు ఎడపల్లి మండల ప్రత్యేక వైద్యధికారి రాజ్ కుమార్ అన్నారు. మండలంలోని ఎంఎస్సీ ఫారం గ్రామంలో ఈ నెల 18న ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజకుమార్ మాట్లాడారు. కంటి వెలుగు సిబ్బందితోపాటు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఎనలేని కృషి చేశారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రెండో విడత కంటి వెలుగు పథకాన్ని అమలుచేసి ఎంతోమందికి కంటి సమస్యలు లేకుండా చేసేందుకు ఈ పథకాన్ని అమలు చేయడం హర్షనీయమన్నారు. మండలంలో సుమారు 4000లకు పైగా మంది కంటి పరీక్షలు నిర్వహించుకొని అద్దాలు తీసుకున్నారని తెలిపారు. ఎంఎస్సీ ఫారంలో నిర్వహించిన కంటి వెలుగులో 652 మందికి స్కీనింగ్ పరిక్షలు చేయడం జరిగిందన్నారు. 82 మందికి రీడింగ్ అద్దాలను అందించామన్నారు. ఆపరేషన్ కొరకు ఐదు కేసులు నమోదైనట్లు చెప్పారు. వీరిని రిఫర్ చేశామని పేర్కొన్నారు. సర్పంచ్ కుక్కెన విజయ్ కుమార్, ఉప సర్పంచ్ సమీర్ ఖాన్, కార్యదర్శి స్వప్న ఆధ్వర్యంలో కంటి వెలుగు వైద్యులకు ఆశ వర్కర్లకు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, కంటి వెలుగు వైద్యులు శ్రీకాంత్, ప్రశాంత్, బిల్ కలెక్టర్ కృష్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, జీసీ సిబ్బంది పాల్గొన్నారు.



కంటివెలుగు వైద్యులు, సిబ్బందిని సన్మానించిన సర్పంచ్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- గాండ్ల రామచందర్



నవతెలంగాణ-నవీపేట్

విద్య, ఉపాధి సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని రాజకీయంగా ఆదివాసీ నాయక పోడ్ కులస్తులు ఎదగాలని సంఘం జిల్లా అధ్యక్షులు గాండ్ల రామచందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివాసి నాయకుడు కులస్తులతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సంఘం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షులు గాండ్ల రాంచందర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా మెట్టు గంగాధర్, కోశాధికారిగా సాయినాథ్, ఉపాధ్యక్షులుగా కంఠం నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేగాం గంగసాయన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు ్సయ్య, రమణ, సాయిలు, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని బాణాపూర్ గ్రామంలో మంగళవారంమేము సైతం మై విలేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హమాలీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. బాణాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రంలో గత వారం రోజుల నుండి ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఫౌండేషన్ వారు మజ్జిగ ప్యాకెట్లను అందజేసినట్టు ఫౌండేషన్ అధ్యక్షులు రైని అశోక్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు రాయిని అశోక్ దురిశెట్టి రవికుమార్, ఎర్రము సాయిలు, ఉపసర్పంచ్ హరి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం అనుబంధం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
బుధవారం 24 మే 2023

ఎస్టీ సెల్ కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని రాంలక్ష్మణ్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కంత్రోత్ శ్రీనివాస్‌ను నియమించినట్లు మండల అధ్యక్షులు ఆంగోత్ గణపతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యండి మదార్, లైని రమేశ్ ,దేవి సింగ్, సుభాష్, శ్రీనివాస్, దశరథ్, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న విండో చైర్మన్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి తెలిపారు. లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో మండలంలోని కంచుమల్, కొండాపూర్, మంబోజీపేట్ గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు దళారుల బారిన పడకుండా రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు ఆకుల సుజాత సురేందర్ బోయిని సాయిలు సొసైటీ సీఈవో సందీప్ కుమార్ అలాగే గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో అంబేద్కర్ గ్రామ సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా పి పద్మారావు, ఆమోస్ ఆర్ శీను, బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా ఆర్ సాయి బాబా, కోశాధికారిగా ఎం ప్రవీణ్, ప్రచార కమిటీ కార్యదర్శులు ఎం లాజర్, పోచయ్య , సంయుక్త దర్శులు జె ప్రశాంత్, రవి, దావీద్, సంపత్ ముఖ్య సలహాదారుగా జి రాజును ఎన్నుకున్నారు. అంబేద్కర్ సంఘం నూతన కమిటీలో మరో 40 మంది గ్రామ యువత కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్టు తెలిపారు. గ్రామ కమిటీల ఎన్నిక పూర్తయిన తర్వాత మండల కమిటీని ఎన్నుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం డివిజన్ ఇంచార్జి బిట్ల సురేందర్, మండల్ కమిటీ నాయకులు కుసుల కంటి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎండలకు రోడ్లు నిర్మానుష్యం



నిర్మానుష్యంగా మారిన పద్మాజివాడి ఎక్స్ రోడ్డు

నవతెలంగాణ-సదాశివనగర్

భానుడి ప్రతాపంతో ప్రజలు బయటకువెళ్లేందుకు జంకుతున్నారు. అత్యవసర పనులు ఉన్న వారు మాత్రమే ఎండ నుంచి రక్షణ పొందుతూ బయటకు వెళ్తున్నారు. మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ బోసిపోతున్నాయి. దీంతో పలువురు తమ ప్రయాణాలను సైతం విరమించుకుంటున్నారు. పద్మాజివాడి చౌరస్తా నుంచి వందలాది మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వేసవి తాపానికి ప్రయాణీకులు ఎవరూ లేకపోవడంతో బస్టాండ్ బోసిపోయింది.

పల్లె ప్రగతి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారి వసంత

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని దేమికలన్ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి వసంత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె నర్సరీలను,శానిటేషన్ పనులను, పరిశీలించారు. గ్రామంలో మురికి కాలువలు, రోడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తాచెదారాన్ని వెంట వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే నర్సరీలలోని మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా నీళ్ళు పోయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున మొక్కలకు సమయానికి నీళ్ళు అందించాలని తెలిపారు. ఆమె వెంట ఎంపిఓ ఇప్సిత రాణి, కార్యదర్శి రమేష్ రావ్, ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు ఉన్నారు.

లింగంపల్లిలో బోనాల పండుగ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయం నూతనంగా నిర్మించగా.. గౌడ కులస్తులు నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. కాగా మంగళవారం బోనాలు తీశారు. గౌడకులస్తుల ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో బోనాలను సమర్పించారు.

మరింత ఉత్సాహంగా పనిచేస్తాం

- క్రమబద్ధీకరణ ప్రకటన పట్ల జేపీఎస్‌ల హర్షం
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-విలేకరులబృందం

తమను క్రమబద్ధీకరించడం పట్ల జూనియర్ పంచాయతీ కార్యదర్శు (జేపీఎస్)లు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు గ్రామాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామని, రానున్న కాలంలో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని తెలిపారు. జేపీఎస్‌లను క్రమబద్ధీకరించనున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించి విధివిధానాలు ఖరారు చేయాలని ఆదేశాలు జారీ చేయడం పట్ల జేపీఎస్‌లు హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా వ్యాప్తంగా మంగళవారం పలు చోట్ల సీఎం కేసీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

సదాశివనగర్ : మండలంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు పాలభిషేకం నిర్వహించారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలబిషేకం చేశారు. అనంతరం స్థానిక ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. జేపీఎస్ లందరికి ఎంపిపి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉష గౌడ్, ఎంపిఓ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి లు సంతోష్, రమేష్ , రాజు, సిద్దు , మల్లిక తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎంపీడీఓ మాలికార్జున్ రెడ్డి, ఎంపీఓ ప్రభాకర్ చారిని శాలువాలు కప్పి సన్మానించారు.

రాజంపేట్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి జడ్పిటిసి కొండా హనుమాన్లు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తున్నట్టు ప్రకటించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. కెసిఆర్ మార్గదర్శాల ప్రకారం మరింత ఉత్సాహంగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ధర్పల్లి : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మినెంట్ చెయ్యాలని రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ జూనియర్ కార్యదర్శులు నిర్వహించిన సమ్మెకు ప్రభుత్వం స్పందించి క్రమబద్ధీకరణ చేయాలని ముఖ్యమంత్రి ప్రకటించారు. దీంతో మండలంలోని పంచాయతీ జూనియర్ కార్యదర్శులు హర్షం వెక్తం చేస్తూ మంగళవారం ఎంపిడిఓ కార్యాలయం ముందు ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజేష్, బారసా మాజీ మండల అధ్యక్షుడు నల్ల హన్మంత్ రెడ్డి, కార్యదర్శులు బాలకృష్ణ, రఘురామ్, తిరుపతి, సుమన్, ఇలియాస్, సాయి కుమార్, రాజ్ కుమార్, సైఫొద్దీన్, దాసు, కార్తీక్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని సీఎం ప్రకటించడం పట్ల మండలం జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. పంచాయతీ జూనియర్ కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడారు. ప్రభుత్వం చెప్పిన మాట మీద నిలబడినందున తాము విధులకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్, ఎంపీడీవో గోపాలకృష్ణ ,గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శులు రాజేశ్వర్ ,గంగాధర్, స్వర్ణలత, పద్మావతి, మండల పరిషత్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్: బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధకరిస్తామని హామీ ఇచ్చినందున ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. డిమాండ్ల సాధనకు 20 రోజులపైగా రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు చేపట్టగా ప్రభుత్వం స్పందించి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పర్బన్న , ఎంపీ ఓ మధుకర్ , జేపీఎస్ యూనియన్ ప్రతినిధులు సుధాకర్, సతీష్, రాజేష్, శైలజ, గంగమణి, హరిత , నాగార్జున, రవి, విశ్వనాథ్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

రెంజల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ కార్యదర్శులకు రెగ్యులర్ చేసినందుకు సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్‌తో పాటు గ్రామ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రెంజల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సిహెచ్ సాయి, నవీన్, సుమన్ ,రాజు శివ కృష్ణ, సాయిబాబా, బి. రాణి, అమరిన్, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ, ముప్కాల్ మండల ప్రజపరిషత్ కార్యాలయం ఆవరణలో జూనియర్ పంచాయితీ కార్యదర్శులు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ముప్కాల్, బాల్కొండ మండలాలకు చెందిన జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు..

ఏర్గట్ల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఏర్గట్ల మండలానికి చెందిన జూనియర్ పంచాయితీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ...ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు.అనంతరం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో జూనియర్ పంచాయితీ కార్యదర్శులు బాజన్న, రాకేష్, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : జూనియర్ పంచాయతీ సెక్రటరీలను క్రమబద్ధీకరణ చేస్తున్నట్టు ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు జేపీఎస్‌లు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాపరెడ్డి, ఎంపీడీవో రాణి, ఎంపీవో సురేకాంత్, జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో సీఎం, మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు..



ధర్పల్లిలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బాజిరెడ్డిచిత్రపటాలకు



ఎల్లారెడ్డిలో..



ఏర్గట్లలో..



రాజంపేట్‌లో..



రెంజల్‌లో

జీలుగతో భూమి సారవంతం

- సబ్సిడీతో పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి
- పలు చోట్లల్ల పెద్ద జనుము, జీలుగ విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/లింగంపేట్

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా జినుగు, జనుము విత్తనాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విత్తనాల వలన నేల సారవంతమై, భూసారం పెరిగి పంటలు సమృద్ధిగా పండుతాయని తెలిపారు. అదేవిధంగా భూమిలో పోషక స్థాయి విలువలు పెరుగుతాయని పంటల దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. జీలుగ 30 కేజీల బస్తా 845 రూపాయలు అదేవిధంగా పెద్ద జనములు 40 కేజీల బస్తా 1224 రూపాయలుగా నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతి ఒక్క రైతు పట్టా పాస్ బుక్ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో కొనుగోలు సెంటర్‌ను సంప్రదించాలని, ఒక బస్తా ఒక హెక్టారుకు సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, సీఈఓ సందీప్, సంజు, శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో

లింగంపేట్ : లింగంపేట్ మండలంలోని ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రాలలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేసినట్టు వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం సహకార సంఘం కుచనపల్లి దేవేందర్ రెడ్డి సుప్పాల రమేష్ రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందజేసినట్టు తెలిపారు.



లింగంపేట్‌లో

లింగంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 150 క్వింటాల్ జీలుగు విత్తనాలు వచ్చాయని, నల్లమడుగు సింగల్ విండోకు 100 క్వింటాళ్లు, శెట్టిపల్లి సంగారెడ్డి సింగిల్ విండోకు 100 క్వింటాళ్లు, రైతు ఆగ్రో ఫారం 50 క్వింటాళ్లు వచ్చినట్టు తెలిపారు. 65 శాతం సబ్సిడీపై రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో కార్యదర్శులు సందీప్, మహిపాల్, డైరెక్టర్లు సాయి, సురేందర్ బి ఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటీ రమేష్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్స కోసం ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్/సదాశివనగర్

లింగంపేట్ మండలం నల్లమడుగు గ్రామానికి చెందిన బండ్ల వంశీ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. శస్త్రచికిత్స చేయించుకునే స్తోమత లేకపోవడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే జాజాల సురేందర్ దృష్టికి తీసుకెళ్లగా.. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి, సంబంధిత డాక్టర్లతో మాట్లాడి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి మెరుగైన చికిత్స అందించాలని సూచించినట్టు నాయకులు తెలిపారు. వైద్య చికిత్స కోసం రూ.1,50,000/- సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ నాయక్, ఎం.డి ఆరీఫ్. కుటుంబ సభ్యులు ఉన్నారు.

సదాశివనగర్ : మండలంలోని కుప్రియాల్ గ్రామనికి చెందిన సామల సాయిరెడ్డికి మంగళవారం లక్ష రూపాయల సిఎంఆర్ ఎఫ్. ఎల్ఓసిని బిఆర్‌యస్ నాయుడు శీను నాయక్ , పీఏ అరిఫ్ అందజేశారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడని మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆదేశాల మెరకు చెక్కు అందజేసినట్టు తెలిపారు.

టార్పాలిన్ కవర్లు అందజేత



టార్పాలిన్ కవర్లు అందజేస్తున్న వైస్ చైర్మన్

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పలువురి రైతులకు మంగళవారం టార్పాలిన్ కవర్‌లు అందజేశారు. మార్కెట్ కమిటీకి పది కవర్లు రాగా.. వాటిని అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ వడ్ల రాజేందర్, సిబ్బంది లక్ష్మీ నర్సయ్య, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారులకు బీమా కల్పించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రజక కులవృత్తి చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బావిలో ,చెరువులో ,కాలువలోపడి చనిపోయిన, బోర్ల దగ్గర విద్యుత్ షాక్ కు గురైన, బట్టలమూట ఎత్తుకుని రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబానికి ప్రమాద బీమా కింద 10 లక్షల రూపాయలు ఇవ్వాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు మచ్చర్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలో నియోజకవర్గ నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర యూత్ అధ్యక్షులు లకడంపల్లి నర్సిములు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మచ్చర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రజక కులస్తుల కోసం అనేక పథకాలు, జీవోలు తీసుకొచ్చినప్పటికి వాటిల్లో కొన్ని అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 ఏండ్లు కావస్తున్నా రజకులకు ఒరిగింది ఏమిలేదని వాపోయారు. నీళ్ల నిధులు నియామకాల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం బాధా కరమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సీనియర్ నాయకులు చౌదరి రాజు, వెలుట్ల సాయిలు, స్వామి, భాస్కర్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ జిల్లా స్థాయి కబడ్డీ, కోకో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది పలుకుతోందని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సీనియర్ సిటిజన్ ఫోరంలో టేబుల్ టెన్నిస్ క్రీడలను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జి ల్లా విద్యాశాఖ అ ధికారి రాజు, ఎస్‌జి ఎఫ్ కార్య దర్శి రసూ ల్, వ్యా యా మ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 4
బుధవారం 24 మే 2023

సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల 28న పూసల చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపడుతున్న 'పూసల సమర శంఖారావం' కరీంనగర్ సభకు జిల్లా నుండి అధిక సంఖ్యలో పూసల సంఘం కులస్తులు, పెద్దలు, నాయకులు, ప్రతినిధులు తరలిరావాలని కోరారు. రాష్ట్రం నుండి పూసల చైతన్య వేదిక సంఘ ప్రముఖులు హాజరు కానున్నారని అధిక సంఖ్యలో పూసల కులస్తులు పాల్గొని సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు అవాలా శ్రీధర్ కోరారు..

నెల రోజులకు చేరిన వీఓఏల సమ్మె

నవతెలంగాణ-వర్ని



ఉమ్మడి మండలంలోని వీవోఏలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 30 రోజులకు చేరింది. ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ నెల రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కారం చేయటంలో విఫలం అవుతుందని అన్నారు. కనీస వేతనం 18వేల రూపాయలు, జీవిత బీమా, ఐడి కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా తమను గుర్తించాలని తెలిపారు. లేకుంటే పోరాటం కొనసాగుతుందన్నారు.

సబ్సిడీ జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

• చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్

నవతెలంగాణ-ధర్పల్లి /ముప్కాల్/ మోర్తాడ్

సొసైటీలో సబ్సిడీ జీలుగ, జనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగించు కోవాలని సొసైటీ చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం అయన సొసైటీలో విత్తనాల పంపిణీ ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ వర్షాకాలం పంటల దిగుబడి సంవృద్ధిగా వచ్చేందుకు అన్ని రకాల విత్తనాలతోపాటు, అన్నిరకాల మందుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలు, పెప్టిసైడ్, యూరియా, 20-20 ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, రాజ్పాల్ రెడ్డి, బారస మాజీ మండల అధ్యక్షుడు నల్ల హన్మంత్ రెడ్డి, వైస్ చైర్మెన్ గున్నయ్యవ ఎండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు సాలేహ బేగం, పెండ ప్రేమ లత, నౌసి, పోతరాజు, రమేష్, కార్యదర్శి గుజ్జుల సంతోష్ రెడ్డి, ఆయాగ్రామాల సర్పంచులు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో..



మోర్తాడ్‌లో..

ముప్కాల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రెంజర్ల ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ చేతులమీదుగా రెంజర్ల గ్రామంలో రైతులకు సబ్సిడీ జీలుగు విత్తనాలను పంపిణి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, ఉప సర్పంచ్ మగ్గిడి మోహన్ రెడ్డి, గ్రామ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు మిట్టపల్లి మహేందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మేడిపల్లి ముత్తేన్న, వ్యవసాయాధికారి రాజ్ కుమార్, ఏఈవో నిషికాంత్, సొసైటీ సెక్రటరీ కె.గంగాధర్ పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. 65 శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను అందజేస్తున్నట్లు చైర్మన్ అశోక్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం సొసైటీలో 833 బస్తాలు అందుబాటులో ఉన్నాయని 30 కేజీల బస్తా 842 రూపాయలకు ఇవ్వనున్నట్టు చెప్పారు. అవసరమున్న రైతులు పంట పాస్ బుక్కు, ఆధార్ కార్డు జిరాక్స్ తో వ్యవసాయ శాఖ అధికారి అనుమతి పొందాలని అన్నారు. జీలుగ సాగు చేయడం వల్ల నేలలో చౌడు సమస్య తగ్గుతుందని, భూమిలోని పొరలలో సేంద్రియ పదార్థం వృద్ధి జరుగుతుందని ఏవో లావణ్య అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పిటిసి రవి, ఏడిఏ మల్లయ్య, ఏవో లావణ్య, ఆనంద్, గంగారెడ్డి, రాజ్ పల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా ప్రొసీడింగ్ కాపీ అందజేత



బీమా ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఏఈవో, నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని అమ్సన్ పల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన రాజోళ్ళ నారాయణ కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.5 లక్షల రైతుబీమా ప్రొసీడింగ్ కాపీని ఏఈఓ సతీష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ సినియర్ నాయకులు తాటిపాముల శ్రీనివాస్ గుప్తా,ఉప సర్పంచ్ రాజశ్వర్ లతో కలిసిఅందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోష్, బోన్ల గంగాధర్, భాస్కర్, అష్రఫ్, రాజేందర్ రెడ్డి,మధుసూదన్, సిరికొండ నరేష్, ధర్మాల శ్రీనివాస్, రాజుల చిన్నారెడ్డి, బైరన్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



నవతెలంగాణ-మోపాల్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు ప్రోగ్రాం కులాస్‌పూర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో కంటి వెలుగు శిబిరం ఎంపీపీ జెరుపుల లతా కన్నీరాం, ఉప సర్పంచ్ బాలు నాయక్ మంగళవారం ప్రారంభించారు. ఎంపీపీ లతా కన్నిరాం మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరూ దృష్టిలోపం లేకుండా ఉండాలని మంచి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కోటగిరి చైతన్య కుమార్ వార్డు మెంబర్లు ఐకెపిసిసి శ్రీమతి శ్రీదేవి, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, తండా నాయకులు పాల్గొన్నారు.

ఆడ బిడ్డ పెళ్ళికి కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రుద్రూర్(వర్ని)

రుద్రూర్ మండలంలోని రాయకూరు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన నసీబ్ ఖాన్ కుమార్తె నౌషీన్ బేగం వివాహానికి 10వేల రూపాయలు డీసీసీ డెలిగేట్ రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్‌రావు ఆర్థిక సహాయం అందించారు. నియోజకవర్గంలో ఆడ బిడ్డల తల్లిదండ్రులకు భారం లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో తమ ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ గంగాప్రసాద్ , జిల్లా మైనారిటీ కార్యదర్శి వహీద్ హుస్సేన్, సులేమాన్ నగర్ ఎంపీటీసీ షేక్ గౌస్,బాన్స్ వాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి నితిన్ పటేల్, సంతోష్,షేక్ సాజిద్,మొయినుద్దీన్, సయ్యద్ మహతాబ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృత్యువాత

నవతెలంగాణ-ముప్కాల్



మండలంలోని వేంపల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. కొంతకాలంగా అవును గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పెంచుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షాక్ కు గురై మృత్యువాత పడిందన్నారు.

నేడునీటి సరఫరా ఉండదు

నవతెలంగాణ కంఠేశ్వర్

మాలపల్లివద్ద ఫీడర్ పైప్ లైన్‌కు ఏర్పడిన లీకేజీ కారణంగా బుధవారం తాగు నీటి సరఫరా ఉండదని నిజామాబాద్ మున్సిపల్ అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. నాగారం, ఇంద్రపూర్, వినాయక్ నగర్, గోల్ హనుమన్, ఎల్లమ్మ గుట్ట, సుభాష్ నగర్, నాందేవ్ వాడ, గంగస్తాన్, హమాల్‌వాడి, దుబ్బ, గౌతం నగర్, కంఠేశ్వర్,చంద్ర శేకర్ కాలనీ, ఎళ్ళమ్మగుట్ట, పోచమ్మ గల్లి, అర్స పల్లి, మాలపల్లి, అహ్మద్ పుర కాలనీ, హబీబ్ నగర్ తదితర ప్రాంతాలలో తాగునీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

• విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో గేదె మృత్యువాత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నాలుగు రోజుల క్రితం పంట పొలాలకు వచ్చే విద్యుత్ తీగలు తెగిపోయి కింద వేలాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో ఒక గేదె విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. ఈ సంఘటన ఇందల్ వాయి మండలంలోని మెగ్యా నాయక్ గ్రామ పంచాయతీ పరిధిలోని తిర్మలయతండాలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు, డిచ్ పల్లి మాజి వైస్ ఎంపిపి పూర్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారం...నల్లవెల్లి సబ్ స్టేషన్ పరిధిలోని తిర్మలయ తండా లో గత నాలుగు రోజుల క్రితం ఒక వాహనం విద్యుత్ తీగలను తగలడంతో వేలాడుతున్న యని ఎల్లారెడ్డి పల్లి సబ్ స్టేషన్ విద్యుత్ శాఖ ఇంచార్జీ ఏఈ కి పూర్య నాయక్ ఫోన్ చేసి విషయాన్ని వివరించారు. అయినా విద్యుత్ తిగలను సరి చేయకపోవడంతో పూర్యనాయక్‌కు చెందిన 85 వేల రూపాయలు విలువగల గెదే గడ్డి మేయడానికి వెళ్ళగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు అయన తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని, ఎవరైనా రైతులు అక్కడికి వెళ్లి ఉంటే వారి ప్రాణాలు సైతం పోయేవని అయన పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన పట్టించుకోక పోవడంతో నే ఈ సంఘటన జరిగిందని అయన ఆరోపించారు. విద్యుత్ శాఖ అధికారులు తనకు నష్టపరిహారం చెల్లించాలని అయన కోరారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే తెగి పోయిన విద్యుత్ తీగలను సరి చేసి ప్రాణ నష్టం జరిగకుంట చుడాలని అయన కోరారు.



మృతిచెందిన గేదె



తెగిపడిన విద్యుత్ వైర్లు

బహుజన రాజ్యాధికార సాధన కోసం

• ఉద్యమించడమే మారోజు వీరన్నకు నివాళి

• బహుజన లెఫ్ట్ పార్టీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

బహుజన రాజ్యాధికార సాధన కోసం ఉద్యమించడమే కామ్రేడ్ మారోజు వీరన్నకు నివాళి అని బహుజన లెఫ్ట్ పార్టీ-బి ఎల్ పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ దండి వెంకట్ పిలుపునిచ్చారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్లో బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి బహుజన కమ్యూనిస్టు పార్టీ బిసిపి పార్టీల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన కామ్రేడ్ మారోజు వీరన్న 24వ వర్ధంతి సభలో దండి వెంకట్ మాట్లాడుతూ.. పూలే అంబేద్కర్ పెరియార్ మార్క్స్ ఆలోచన విధానంతో తెలంగాణలో బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేస్తున్న క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో నరహంత చంద్రబాబు నాయుడి ప్రభుత్వం చేసిన రాజకీయ హత్యలో కుల వర్గ సైద్ధాంతిక యోధుడు కామ్రేడ్ మారోజు వీరన్న మృతి చెందారని తెలిపారు.

బిఎల్ పి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరిగాద సిద్ధిరాములు, బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు పసుల వెంకన్న మాట్లాడుతూ అన్ని సమస్యలకు పరిష్కారం బహుజన శ్రామిక వర్గ ప్రజలకు రాజ్యాధికారం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమానికి బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకులు న్యాయవాది జి.రమేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బహుళజన లెఫ్ట్ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వడ్ల సాయి కృష్ణ, బహుజన మహిళా సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగా మణి, స్వప్న,సమ్రిన్ , బిఎల్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ నగర కార్యదర్శి గంగా శంకర్, నాయకులు గోపి నాథథ్, విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ శ్రీమాన్ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన బిఎల్ పి, బహుజన కమ్యూనిస్టు పార్టీ (బిసిఎ) ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాగర్జన బహిరంగ సభ జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జూన్ 4న నిర్వహించే సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయండి అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యాలయంలో మంగళవారం జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుండి మే 15 వరకు దేశవ్యాప్తంగా బిజెపి హటావో దేశ్కో బచావో కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని చెప్పారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన సమస్యలపై మరిన్ని ఉద్యమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జూన్ 4 కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు జరుగు బహిరంగ సభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ప్రజాగర్జన బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్యక్రమంలో సిపిఐ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి ఓమయ్య, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.రంజిత్ కుమార్, రఘురాం ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

• గ్రామాల్లో అధ్యాపకుల ప్రచారం

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రములోని ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరుతు కళాశాల అధ్యాపకబృందం గ్రామ గ్రామాన ప్రచారం చేస్తూ విద్యార్థులను అత్యధికంగా చేర్పించుకునేందుకు ప్రచారం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని గ్రామాలతోపాటు పక్క మండలంలోని సమీప గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహనా కల్పిస్తూ కళాశాలలో చేర్పిస్తున్నారు,. న్ని సబ్జెక్టు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాటు ,తమ కళాశాలలో సకల సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు వచ్చేందుకు అనువుగా కళాశాల బస్టాండు సమీపంలో ఉందని, కార్పొరేట్ స్థాయి విశాల భవనం, గతంలో తమ కళాశాల ఉత్తీర్ణతాశాతం గురించి వివరిస్తునఆనరు. ప్రయివేటు కళాశాలల్లో లక్షలకు లక్షలు దండగ ఎందుకు చేసుకుంటారని విద్యార్థుల అపోహలను దూరం చేస్తూ కళాశాలలో మూడు రోజుల్లో 30 మంది వరకు కొత్త విద్యార్థులకు చేర్పించు కుంటున్నట్టు తెలిపారు.



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఆ భూమి కబ్జా కాకుండా చూడండి

• తహసీల్దార్‌కు ఎమ్మెల్యే ఆదేశాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భూమి కబ్జా కాకుండా చూడాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాలను జారీ చేసినట్లు బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.మంగళవారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని గన్‌పూర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఘన్‌పూర్ గ్రామ శివారులో గల 349 సర్వే నంబర్లో గల భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, భూమిని ఘనపూర్ గ్రామ ప్రజల అవసరాల కోసం వాడుకోవడం కోసం చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు. వెంటనే స్పందించిన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సానుకూలంగా స్పందించి తహసిల్దార్ శ్రీనివాస్ రావుకు భూమి కబ్జా కాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సినియర్ నాయకులు రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్ సతీష్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పెద్దపులి భూమయ్య, సాకలి చిన్న గంగారం, మహేష్, నర్సయ్య, దేవయ్య, గంగారం,దశరథ్ ,తిరుపతి, కుమ్మరి కిషన్ రైతులు ఉన్నారు.

రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి ఎస్‌డిఎఫ్ నిధుల నుండి మంజూరైన 5లక్షల రూపాయల ప్రొసీడింగ్ పత్రాన్ని సర్పంచ్ నడ్పన్నకు ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన నివాస గృహం లో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ టీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలు, వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 42 కోట్లు ఎస్ డి ఎఫ్, సిడిపి నిధులతో చాలావరకు కమ్యూనిటీ భవనలను నిర్మించుకోవడం జరిగిందని, ఇంకా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో ఇప్పటివరకు 20 కోట్ల రూపాయలతో గ్రామ గ్రామాన సిసి డ్రైనేజీలు, రాహదరుల నిర్మాణం జరిగాయని అయన వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆలయ కమిటీ చైర్మన్ సాయిలు మృతి

నవతెలంగాణ-ఎడపల్లి



పురం సాయిలు (ఫైల్)

మండలంలోని జాన్కంపేట్‌లోగల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జానకంపేటకు చెందిన పురం సాయిలు (60) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతుడు ఆలయ అభివృద్ధికి ఎంతో తన వంతు కృషి చేస్తూ గ్రామస్తుల ఆదర బి మానాలను పొందారు. రెండవసారి ఆలయ కమిటీ చైర్మన్ బాధ్యతలు తీసుకొని ఆలయంలో జరిగే కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యుల సహకారంతోపాటు గ్రామ స్తుల సహ కారాన్ని తీసుకొని ఆలయంలో జరిగే కార్యక్రమాలను ఘన ంగా నిర్వహించేందుకు కృషి చేసేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు..

పురం సాయిలు అంత్యక్రియల్లో ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్ జానకంపేట సర్పంచ్ సాయిలు, ఎంపీటీసీ, టిఆర్ఎస్ ఎడపల్లి మండల ప్రధాన కార్యదర్శి మంద సంజీవ్ కుమార్ ,ఉపసర్పంచ్ విజయ్ లతోపాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్థానిక , బంధువులు, స్నేహితులు గ్రామస్తులు పాల్గొన్నారు..

సెల్ ఫోన్లు అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఒకటో పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు సెల్ ఫోన్లను ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ విజయ్ బాబు మంగళవారం బాధితులకు అందజేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయగా మూడు సెల్ఫోన్లను సిఈఐఆర్ అండ్ సిబ్బంది ఎక్కడ ఉన్నాయో ట్రేస్ చేసి గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బాధితులతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ. లక్ష 50వేల విరాళం



దాతలకు సన్మానించిన ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన జైడీ రాజేష్, జైడీ గణేష్ సోదరులు తమ వంతు సహాయంగా రూ. లక్ష 50వేల విరాళం అందజేశారు మంగళవారం విరాళం మొత్తాన్ని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. వారితోపాటు కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్, అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, పెంట కిషన్, రాజశేఖర్, వేముల గంగారాం, గుండోజి రవీందర్, రవి, గణేష్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

పురం సాయిలు మృతి బాధాకరం బోధన్ ఎమ్మెల్యే ఎండి షకిల్ ఆమేర్

జానకంపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పురం సాయిలు గుండెపోటుతో మృతి చెందడం బాధాకర విషయం అని బోధన్ ఎమ్మెల్యే ఎండి షకిల్ ఆమేర్ అన్నారు. పురం సాయిలు టిఆర్ఎస్ పార్టీ బలోపేతనానికి జానకంపేట గ్రామంలో విశిష్టంగా కృషి చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తపరుస్తూ సంతాపం ప్రకటించారు.

విగ్రహ ఆవిష్కరణకు మంత్రికి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలో ఈ నెల 27న నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహ ఆవిష్కరణకు అతిథిగా విచ్చేయాలని ఉమ్మడి జిల్లా డీసీసీబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డితో కలిసి మంగళవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మంగళవారం హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు. నాయకులతోపాటు సినీ రంగ ప్రముఖులు హాజరు అవుతున్నట్లు కమ్మ సంఘ అధ్యక్షులు తెలిపారు.